క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుల నియామకం



ఎమ్మెల్యే తలారి వెంకట్రావును సత్కరిస్తున్న ఏసుబాబు, తదితరులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలంలోని పలు గ్రామాలకు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నియమించారు. ద్వారకాతిరుమలకు అచ్యుత ఏసుబాబు, ఎం.నాగులపల్లికి బోయపాటి మోహన్‌రావు, మారంపల్లికి చిలుకూరి రాధాకృష్ణ, బుట్టాయిగూడెంకు పెండ్యాల విజయ్, నారాయణపురానికి గొన్నూరి వెంకటేశ్వరరావు, సత్తాలకు బాదిన గోపన్నను, పి.కన్నాపురానికి అల్లే వెంకటేష్, రాజుపాలెంకు దొప్పసాని రాంబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏసుబాబు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి, పూల బొకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి తదితరులున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేయనున్నారని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాన్ని కేఆర్‌పురం ఐటీడీఏ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ మేరీ కేథరిన్, వైద్య బృందంతో కలిసి దుద్దుకూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్, డాక్టర్ సుధాకర్, ఎంపీటీసీ సవలం కోటేశ్వరరావు,పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్షపై సమావేశం

కామవరపుకోట: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, అధికారులు, గౌరవ ప్రత్యేక అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

బుట్టాయగూడెం: కొమ్ముగూడెం, బూసరాజుపల్లి గ్రామాల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు బుట్టాయగూడెం ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ వర్మ తెలిపారు. కొమ్ముగూడెం, కృష్ణాపురం, బూసరాజుపల్లి గ్రామాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: దాడి చేసి ఒక వ్యక్తిని గాయపర్చిన నేరంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం పట్టణానికి దొడ్డి నవీన్ తాపీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. ఈ నెల 13న అతని భార్యను అత్తగారింటికి తీసుకువెళ్లగా, అత్తగారు నూకవరపు చంద్ర, నూకవరపు విజయ, మరో వ్యక్తి కలిసి మద్యం సేవించి వచ్చావు అంటూ నవీన్‌పై దాడి చేశారు. ఈ దాడిలో నవీన్ తీవ్రంగా గాయపడటంతో 108 వాహనంలో అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు పిల్లల అదృశ్యంపై..

జంగారెడ్డిగూడెం: బాలుడు, బాలిక అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని వేగవరానికి చెందిన వంగా అంజయ్య సంతానమైన 8వ తరగతి చదువుతున్న 14ఏళ్ల బాలిక, 6వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల బాలుడు వేగవరంలోని హైస్కూల్‌కు ఈ నెల 10న వెళ్లి, సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇంటి వద్ద గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళపై దాడి చేసిన వారిపై..

జంగారెడ్డిగూడెం: ఒక మహిళను కులం పేరుతో దూషించడమే కాకుండా ఆమెపై దాడి చేసి కొట్టి గాయపర్చి చంపేస్తానని బెదిరించిన నేరంపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం ప్రస్తుతం పాతబస్టాండ్ వద్ద నివసిస్తున్న నున్న లక్ష్మి కుమారైకు, గౌర్రు కార్తీక్ శివప్రసాద్‌కు గతంలో వివాహమైనా విడిపోయారు. కాగా, లక్ష్మి గల్ఫ్‌లో పనిచేస్తున్న సమయంలో కార్తీక్ శివప్రసాద్‌కు రూ.5 లక్షలు ఇచ్చింది. ఆ సొమ్మును అడిగేందుకు ఈ నెల 8వ తేదీన వెళ్లిన తనపై కార్తీక్ శివప్రసాద్ మరో ముగ్గురు కలిసి తీవ్ర పదజాలంతో దూషించడమే కాకుండా వివస్త్రను చేసి పెట్రోల్‌పోసి చంపేస్తానని బెదిరించారని, కులం పేరుతో దూషించారని లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నవరత్న పథకాలే శ్రీరామరక్ష

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- తెడ్లంలో గడపగడపకు మన ప్రభుత్వం



తెడ్లంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నరసాపురం: ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని తెడ్లం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలు తెలియజేస్తూ స్థానిక సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, కుల, మత, వర్గ భేదాలు లేకుండా అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే అని అన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచిందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా గ్రామంలోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఎటువంటి పనైనా సచివాలయం ద్వారా, వలంటీర్‌ల ద్వారా చేయిస్తున్నారని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ఎప్పటికప్పుడు కొత్త లబ్ధిదారులకు సైతం ఆయా పథకాలను అందిస్తున్నామని తెలిపారు. అర్హత ఉండి ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, నవరత్న పథకాలే తమకు శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు అధ్యక్షులు, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు, మక్కినవారిగూడెం సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, పామాయిల్ ఓఈఆర్ కమిటీ మెంబర్ తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, దేవరపల్లి ముత్తయ్య, ఎంపీటీసీ బండి సుబ్బారావు, మండల యూత్ అధ్యక్షుడు కన్నం సర్వేశ్వరరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, కొరప్రోలు భాస్కరరెడ్డి, కె.రవి, బోళ్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతికి బ్రాండ్ అంబాసిడర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నరసాపురం: తలకిందులుగా తపస్సు చేసినా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శిక్ష నుంచి తప్పించుకోలేరని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. టి.నరసాపురం మండలం తెడ్లం గ్రామంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ అని అభివర్ణించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికి అరెస్ట్ అయిన చంద్రబాబు పాపం పండిందన్నారు. చంద్రబాబు అవినీతి చక్రవర్తి అని, బ్రాండ్ అంబాసిడర్ అని, ఇప్పటి వరకు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారన్నారు. నూరు ఆంబోతులను తిన్న రాబందులు సైతం ఒక్క గాలి వానకు కొట్టుకుపోతాయన్నారు. అన్ని ఆధారాలతోనే చంద్రబాబును అరెస్టు చేశారని, ఇందులో రాజకీయ దురుద్దేశ్యం లేదన్నారు. తప్పు చేయడం వల్లే దొరికిపోయారన్నారు. అరెస్టు అయిన తరువాత చంద్రబాబు నాటకాలు మొదలు పెట్టారని విమర్శించారు. రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నా ప్రజల్లో ఎటువంటి సానుభూతి లేదన్నారు. టీడీపీ బంద్‌లో ప్రజల భాగస్వామ్యం లేకపోవడంతో బంద్ పూర్తిగా విఫలమైందన్నారు. సింపతి కోసం చంద్రబాబు సొంత పుత్రుడు, దత్తపుత్రుడుతో పాటు బావమరిదిని కూడా వాడుకుంటున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు అమరావతి, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్ వంటి కేసులను కూడా సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఎటువంటి దర్యాప్తుకైనా సిద్ధం

పోలవరం నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ తనపై చేసిన ఆరోపణలకు తాను ఎటువంటి విచారణకైనా సిద్ధమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు స్పష్టం చేశారు. సిట్‌కైనా, సిట్టింగ్ జడ్జితో విచారణకైనా, సీబీఐ విచారణకైనా తాను సిద్ధమని, చంద్రబాబు, లోకేశ్ వారి ఆస్తులపై విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. తాను 2004 నుంచి దుద్దుకూరులో అదే ఇంట్లో ఉంటున్నాని, పూర్తిస్థాయి ప్రజా సేవకే తన జీవితం అంకితమన్నారు. పోలవరం నిర్వాసితుల డబ్బులు టీడీపీ హయాంలో దోచేశారని విమర్శించారు. నీతి, నిజాయితీ ఉండబట్టే తాను ప్రజల్లో నుంచి నాలుగు సార్లు గెలిచానని, లోకేశ్ వార్డు మెంబర్ కూడా గెలవలేదని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజాదరణ ఉందని, వచ్చే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదేనని బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు అధ్యక్షుడు, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు, మక్కినవారిగూడెం సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, పామాయిల్ ఓఈఆర్ కమిటీ మెంబర్ తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, దేవరపల్లి ముత్తయ్య, ఎంపీటీసీ బండి సుబ్బారావు, మండల యూత్ అధ్యక్షులు కన్నం సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ హర్షం

జంగారెడ్డిగూడెం: ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ)కు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు రావడంతో యూనియన్ సభ్యులు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద సంబరాలు జరుపుకున్నారు. తమ యూనియన్ గుర్తింపునకు సహకరించిన సీఎం వైఎస్ జగన్‌కు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి ఆర్టీసీ ఎండీకి, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నరసయ్యకు, రాష్ట్ర చైర్మన్ పలిశెట్టి దామోదర్‌కు రీజనల్ వైస్‌చైర్మన్ బీవీఎస్ఎస్.రంగనాయకులు, డిపో సెక్రటరీ ఎం.పాండురంగారావు కృతజ్ఞతలు తెలియజేశారు.

పింఛన్ల మంజూరుతో అవ్వాతాతల కళ్లల్లో ఆనందం



ద్వారకాతిరుమలలో లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్లు అందుకున్న అవ్వా, తాతల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పాత పింఛన్లు 5,556 కాగా, కొత్తగా 532 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. టీడీపీ హయాంలో కొత్త పింఛన్ మంజూరు చేయాలంటే, లబ్ధిదారుల్లో ఒకరు చనిపోతేనే గానీ మంజూరు చేసేవారు కాదని, తమ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదన్నారు. సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన సాగిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎం చేసుకుంటే సంక్షేమ పాలన కొనసాగుతుందని, మన బిడ్డల భవిష్యత్ బాగుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, సొసైటీ చైర్‌పర్సన్‌లు గుర్రాల లక్ష్మణ్, గోపా నాగేశ్వరరావు, చెరుకూరి ప్రసాదరావు, సర్పంచ్‌లు కుంటం స్వర్ణలత, పోలవంపల్లి అనీల్, మానుకొండ మణి, పల్లి నిర్మల, ఎర్రగొల్ల రజని, ప్రత్తిపాటి యోహాను, కేతా సుబ్రహ్మణ్యం, మానుకొండ ప్రసాద్, యంత్రపాటి సునీల్, ఎంపీటీసీలు రుద్ర నాగసూర్యకళ, పెద్దిరెడ్డి రమ్యకుసుమ, అల్లాడ హరేరామకృష్ణ, మానుకొండ కన్నయ్య, వసంతాటి లక్ష్మి, మనెల్లి మణి, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఎంపీడీవో తిరుపతిరావు, తహసీల్దార్ కె.సతీష్ తదితరులున్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తాం

జంగారెడ్డిగూడెం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందిస్తామని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో కొత్తగా మంజూరైన 226 పింఛన్‌లను ఆమె గురువారం కౌన్సిలర్‌లు, నాయకులు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, కౌన్సిలర్ పీపీఎన్‌చంద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

435 పింఛన్ల పంపిణీ

కుక్కునూరు: మండల వ్యాప్తంగా నూతనంగా మంజూరైన 435 పింఛన్‌లను గురువారం ఆయా సచివాలయ పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పంపిణీ చేశారు. కుక్కునూరులో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పింఛన్‌లు పంపిణీ చేశారు.

కొయ్యలగూడెం: నూతనంగా మంజూరైన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాజవరం పంచాయతీ గంగవరం సచివాలయం-2 పరిధిలో గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 47 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.

కామవరపుకోట: కొత్తూరు గ్రామ సచివాలయ పరిధిలో 42 కొత్త పింఛన్లను లబ్ధిదారులకు సర్పంచ్ కర్రిపోతు అనూష గురువారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నానాది సాగర్, మేడంకి చిన్న, అప్పారావు, భోగయ్య, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క లబ్ధిదారుడికి పింఛన్ అందజేయడం జరుగుతోందని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని గూటాల, జిళ్లేళ్లగూడెం, వింజరం పంచాయతీల్లో కొత్తగా మంజూరైన పింఛన్‌లను స్థానిక ప్రజా ప్రతినిధులతో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంపీటీసీ దెగపాటి హరిరామకృష్ణ, సర్పంచ్ సిరపరపు ప్రసాద్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో కొత్తగా మంజూరైన 15 పింఛన్లను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి చేతుల మీదుగా ఈ పింఛన్లు అందజేశారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

బుట్టాయగూడెం: విద్యార్థులు త్రిభాషా సూత్రంలో హిందీని చక్కగా అభ్యసించాలని స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఇరపా గంగాదేవి అన్నారు. హిందీ దివాస్ వేడుకలను హైస్కూల్ ప్లస్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచంలోనే అత్యధికంగా మాట్లాడే భాషల్లో రెండో స్థానం హిందీ భాషదేనని గంగాదేవి అన్నారు.

కామవరపుకోట: కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.రామసుందరి అధ్యక్షతన, రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన 74వ జాతీయ హిందీ భాష దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హిందీలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హిందీ భాష బోధనలో కృషి చేస్తున్న ఉపాధ్యాయులు మహమ్మద్ సాదాతుల్లాను, వీకే ఎల్ వనజా, రాజేశ్వరిలను సత్కరించారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల, గుణ్ణంపల్లి గ్రామాల్లోని సంస్కృతోన్నత పాఠశాలల్లో హిందీ భాష దినోత్సవం నిర్వహించారు. ద్వారకాతిరుమల పాఠశాలలో హెచ్‌ఎం శేషుకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు హిందీ అనే లెటర్ ఆకారంలో కూర్చున్నారు. గుణ్ణంపల్లిలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. హిందీ ఉపాధ్యాయురాలు లీలాకుమారిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ద్వారకాతిరుమల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలను గుణ్ణంపల్లి సంస్కృతోన్నత పాఠశాలలో ఈనెల 13న నిర్వహించారు. అందులో పాల్గొన్న గుణ్ణంపల్లి పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు పి.దుర్గారావు, సీహెచ్ ధర్మతేజ, కె.సందీప్, పి.గణేష్, ఎన్.నిరంజన్, ఎస్‌డీ గౌస్‌బాబు సీనియర్ కబడ్డీ విభాగం నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు వై.సురేష్‌బాబు తెలిపారు.

శివపార్వతులకు పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేంచేసిఉన్న విజయదుర్గ అమ్మవారి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా శివ పార్వతులకు పల్లకీ సేవ నిర్వహించారు. పురవీధులలో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. సుదర్శనం వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

నిధులు దుర్వినియోగం కాలేదు

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో ఎటువంటి అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరగలేదని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.శేషుకుమారి స్పష్టం చేశారు. స్థానిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగినట్టు, ఒక ఉపాధ్యాయుడు అందుకు కారణమని ఆరోపణలు వచ్చాయి. వాటిపై జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఎంఈఓ-1 ఇ.శ్రీనివాసరావు ఈనెల 14న విచారణ నిర్వహించారు. ఈ విచారణలో అవకతవకలు జరగలేదని తేలిందని పాఠశాల హెచ్‌ఎం శేషుకుమారి ఒక ప్రకటన ద్వారా గురువారం తెలిపారు.